
కథ

# సర్వేంద్రియానాం...

మంచికంటి

తెల్లని పాల వెన్నెల్లాంటి తళతళ మెరిసిపోయే పక్షులు. ఎంత అందంగా ఉన్నాయో... ఇటు రాండి... ఇటు... ఇటు. తన వైపే చూస్తున్నాయి. తలలతో సైగలు కూడా చేస్తున్నాయి. గొంతెత్తి పిలుస్తున్నాయి. వొస్తున్నా... నేనూ వొస్తున్నా. ఎంత ముద్దుమురిపాలు కుమ్మరిస్తున్నాయో...! మురిపించి మైమరిపిస్తున్నాయో! అరెరే దగ్గరగా వొస్తుంటే దూరంగా పోతారేందమ్మా. నన్నూ మీ జట్టులో చేర్చుకోరూ....! అయ్యో ఎగిరి పోతున్నారెందుకు? అయినా... ఆ... ఆ... అందుకుంటాలే. మిమ్మల్ని ఆదు కుంటాగా! అరే... నేనూ గాల్లో తేలుతున్నానే! ఆహా శరీరం తేలికై దూదిపింజలా తేలుతుందే....!



ఓ... నాకూ రెక్కలొచ్చేశాయి. నేనూ మీతో వస్తున్నానుగా. ఎంత దూరమని వెళతారు. ఇలా ఎగురుకుంటూ అయ్యో! ఇంత ఎత్తులో ఎంత భయంగా ఉందో!

ఈ కొండలూ, గుట్టలూ, మైదానాలూ ఎంత అబ్బుర పరుస్తున్నాయి. ఈ చెట్లేమిటి ఆకాశంతో పోటీ పెట్టుకుంటూ ఎదుగుతున్నాయే! ఆహాహా ఈ వెండి మబ్బుల్లో తేలిపోతుంటే ఎంత హాయిగా చల్లగా తనువు మైమరచి పోతుందో!

ఓహ్.... ఎంత మనోహరమైన ప్రపంచమిది. సమ్మోహకర ప్రపంచంలోనికి లాక్కుపోతున్నాయే. జల పాతాలూ అవి కొండలే కరిగి నేల మీదకు ప్రవహిస్తున్నట్టుగా ఉన్నాయే.

ఇదేమిటి... ఆ... ఆ... ఇదేమిటి? పడి పోతున్నానే! అయ్యయ్యో జలపాతంలో పడి పోతున్నానే! ఎవరో లాగుతున్నారే! ఎవర్రా నన్ను కిందకు లాగేదీ...?

''ఎవరూ? సరోజా నువ్వా? ఎంత కమ్మని కలను చెడగొట్టావ్... ప్చ్ ... అయ్యో!''

''ఏమిటండీ ఇక్కడ నేను అరిచి గీపెడుతున్నాను. మీకు వినపడడం లేదా!''

'అబ్బా ఎంత పెద్దగా అరుస్తుందో!

ఎవరు పిలిచినా కళ్ళు తెరవగూడదు అనుకుంటూ. హఠాత్తుగా విచ్చుకుంటాయి. ఎందుకీ కనురెప్పలు. ఇంకేమైనా ఉందా! నెమ్మదిగా తెరవాలి. నెమ్మదిగా... కళ్ళపై అరిచేతులుంచితే ఎంత వెచ్చగా ఉంది. చీకటి జీవితానికి వెలుతురునిచ్చే తారకల్లా... హా... ఈ జీవితానికివే గవాక్షాలు కదా! ''పిలుస్తుంటే కళ్ళు తెరవరేమిటి'' కసురుకుంటూంది సరోజ.

నువ్వు కసురుకున్నా విసురుకున్నా లాభం లేదమ్మా. చీకటి లోకంలో నుండి వెలుతురు ప్రపంచంలోనికి ప్రయాణించేటప్పుడు నెమ్మదిగా రెప్పలు విప్పార్చుకుని లోకాన్ని చూడాలి. ఇవి గాజుగోళాలు. వీటికేమైనా అయితేనా! హమ్మో ఇంక తట్టుకోగలనా! గుండె వేగంగా కొట్టుకుంటుంది.

''ఎన్నిసార్లు పిలవాలి మిమ్మల్ని. రోజూ నాకి దొక తంతుఅయిపోయింది. విసిగించకుండా లేవండి'' పెద్దగా అరిచింది సరోజ.

''ఎందుకంత పెద్దగా అరుస్తావు? నాకేమన్నా చెముడనుకున్నావా!''


''నా మాటంటేనే ఎందుకలా విసుక్కుంటావు. ఇదుగో ఊరికి దూరంగా విసిరేసినట్టుగా తీసుకున్నారే ఇల్లు. ఎన్నిసార్లు చెప్పినా నా మాటేమైనా తలకెక్కుతుందా!''

రోజుకి ఎన్నిసార్లు అంటుందో ఈ మాట. నా మనసు అరల్లో కొచ్చి అణువణువూ తడిమి చూడు ఒక సారి. ఎట్లా చెబితే తెలుస్తుంది నీకు. పుట్టినప్పటి నుంచీ నీకు కళ్ళున్నాయి కాబట్టీ వాటి విలువేమిటో తెలియదు నీకు.

నాకు తెలుసు వాటి విలువేమిటో! ఇంత అందమైన లోకాన్ని చూడకుండా ఇరవై అయిదు సంవత్సరాలు నరకాన్ని అనుభవించాను తెలుసా! ఎన్నిసార్లు చెప్పినా నా బాధ అర్థం చేసుకోవేంది.

నీకెలా చెబితే తెలుస్తుంది. నావైపు నిలబడి ఆలోచిస్తే తెలుస్తుంది. నన్ను పూర్తిగా అర్థం చేసుకుంటే తెలుస్తుంది. నేనెంత క్షోభ పడ్డానో...! ఎంత నరకం చవి చూశానో!

దారిన పోతుంటే ఎన్నిరకాల సువాసనలు ముక్కుపుటాలకి సోకి మనసులోకి హాయిగా కమ్మని కలలా ఇంకిపోతుంటే ఎంత తన్మయత్వంతో మైమరచిపోయి నిలబడే వాడినో...! అయినా ఏం లాభం కంటితో చూడలేని గుడ్డి వాణ్ణి. చూడాలన్నా చూపులేని వాణ్ణి.




తన్మయత్వం అంచునుండి తడిమే వాణ్ణే కానీ... చూడలేక పోతున్నందుకు వలవలా ఏడ్చేసే వాణ్ణి.

''వినపడుతుందా నేను చెప్పేది. ఇంట్లో ఏ వస్తువు అయిపోయినా ఎంతెంత దూరం పోవాల్సి వొస్తుందో తెలుసా మీకు. ఉదయాన్నే ఇంట్లో పనులు చేసుకునేదా! మైళ్ళకు మైళ్ళు పరుగులు తీసేదా చెప్పండి.''

ఏం చెబుతాను నీకు. ఎన్నిసార్లు వివరించి చెప్పాలి. నాకు అర్థాంగివి అయ్యావే కానీ నన్ను అర్థం చేసుకోలేక పోతున్నావు.

ఊరి నట్టనడి మధ్యలో ఉంటే సూర్యోదయాలను, చంద్రోదయాలను చూడగలిగే వాళ్ళమా. పిండార బోసిన చల్లని వెన్నెల్లో వెల్లకిలా పడుకుని మనసారా గుండెల నిండుగా చల్లని గాలిని పీల్చే వాళ్ళమా! మల్లెల వెన్నెల్ని దోసిళ్ళతో ఎగరేసేవాళ్ళమా లెక్కలేనన్ని నక్షత్రాల్ని లెక్క పెట్టుకుంటూ రాత్రుళ్ళకు రాత్రుళ్ళు గడిపే వాళ్ళమా!

''ఏందదీ ఉలుకూ పలుకూలేదు. ముందా దుప్పటితీసి కిందకు దిగండి. ఇంట్లో టీ పొడి అయిపోయింది. పోయి తీసుకురండి. టీ తాగందే నేను ఏ పనీ చెయ్యనని తెలుసు కదా మీకు''.

లేశాను కదా! లేచిన వాడిని వెళతాను కదా! ఇంకా ఎందుకు సతాయిస్తావు. ఊరకలేసి కూర్చోవడం కాదు. మంచంపై నుండి లేవండి. లేచి నిలబడతారే బయలు దేరండి. అడుగులు పడడం లేదే. ఇంటి కాంపౌండు దాటంటి.

అదుగదుగో ఆ మొక్కలు.. మొక్కల దగ్గర ఆగకుండా వెళ్ళండి. గడప దాటితే ఆ మొక్కలదే లోకం అయిపోతుంది. మీకు.

పిచ్చిదానా జడ నిండా పూలు పెట్టుకోవడం ఒక్కటే తెలుసు నీకు. ప్రకృతిలో రకరకాల మొక్కలూ, అవి పూసే రంగురంగుల పూలు, అవి వెదజల్లే సువాసనలు.. మనసునిండా... కాదు కాదు... జీవితం నిండా... బ్రతుకు నిండా అల్లిబిల్లిగా అల్లుకుంటే తెలుస్తుంది.

చూడవే ఇటు చూడు. మల్లె... జాజి... విరజాజి, పొన్న, పొగడ, గోరింట, సంపంగి, గులాబి, మందార పూలకు ఎన్నెన్ని రకాల సొగసులో... ఎంత మైమరిపించే పరిమళాలో... మనసుపై దేని సంతకం దానిదే కదా!

కొమ్మలు ఊగుతూ పిలుస్తాయి చూడు మనుషుల్ని. వీటికి మాటలు రానిదెక్కడో?

అదుగో మళ్ళీ ఆగిపోయారక్కడ. వెళ్ళండి టైమౌతుంది. మనమేమీ కారుల్లో వెళ్ళడం లేదు ఆఫీసుకి. ఆ సిటీ బస్సుల్లో చస్తూ బతుకుతూ

వేళ్ళాడుతూ వెళ్ళాలి. మీకేనండీ చెప్పేదీ. ఎంత చెప్పినా వినరండీ. లేవండి చెట్లకు పాదులు తరువాత చెయ్యొచ్చు.''

లేస్తున్నాన్లే. పాపం వాటి ఆలనా పాలనా మనం కాకుంటే ఇంకెవరు చూస్తారు. మనల్ని నవ్వించి కవ్వించి లాలించి జోలపాడి నిదుర పుచ్చుతాయే వాటి అందాలు. జీవితంలో మరుగున పడిపోయిన భావాలెన్నింటినో మళ్ళీ మళ్ళీ తట్టి లేపుతాయే! వాటి గురించి పట్టించుకోకపోతే ఎలా? అమాయకమైన చూపుల్తో ఎలా చూస్తున్నాయో చూడా పూల రెమ్మలు.

''ముందా చేతుల మట్టి కడుక్కోని పొండి. ఛాఛా ఎన్నిసార్లు చెప్పాలి మీకు''. ఎంత అసహ్యంగా పెట్టావే ముఖం. ఈ మట్టినేనా ఇంతగా ఈసడించుకుంటున్నావు. మట్టిలో పుడతాము. అక్కడే పెరుగుతాము. మట్టిలో నుండి వొచ్చిన వాటినే తింటాము. చివరకు దాన్లోకే పోతాము. అయినా మట్టంటే ఎంత ఏవగింపే మనిషికి.

''అబ్బబ్బా వెంటపడి వెంటపడి చెప్పాల్సి వస్తుంది. నా తల ప్రాణం తోకకు వస్తుంది. మీ చాదస్తం రోజురోజుకీ శృతిమించి పోతుంది. పోతూపోతూ మధ్యలో ఆగకండి. ప్రతి విషయమూ చిత్రంగానే కనిపిస్తుంది మీకు. అప్పుడే కొత్తగా చూస్తున్నట్టు మై మరచిపోయి చూస్తుంటారు. ఛా..''

కంటికి కనబడిన అందమైన దృశ్యాన్ని చూడకుండా ఉండే కళ్ళెందుకు! కళ్ళు కనబడనంత కాలం ఎంత నరకాన్ని అనుభవించానో తెలుసా నీకు!

కన్నందుకు తల్లిదండ్రులు బాధని దిగమింగుకుని భరించారు కానీ... వాళ్ళు గుండెల మీద ఎప్పుడు కుంపటిగానే భావించే వాళ్ళు! తోడబుట్టిన వాళ్ళు తక్కువ తిన్నారా. వాళ్ళలాగే నేనూ పుట్టానని ఎప్పుడూ భావించలేదు. వాళ్ళ తమ్ముణ్ణి అని చెప్పుకోవడానికీ సిగ్గు పడే వాళ్ళు, ప్రతి క్షణం నా ఉనికినే సహించలేనట్లుగా ఉండే వాళ్ళు.

కళ్ళు లేకపోయినంత మాత్రాన మనిషి మనిషి కాకుండా పోతాడా! మనసెక్కడకుపోతుంది. దానితో ఎవరు మాట్లాడేరు అప్పుడు.... ఎన్ని గాయాలైనాయో ఎవరికైనా తెలుసా! ఇంట్లో వాళ్ళే ఎన్నెన్ని సూటిపోటి మాటల సూదులు దించేవాళ్ళో.

శనీశ్వరుడిలా వాళ్ళ పాలబడ్డానని వినపడీ వినపడనట్లుగా వాళ్ళు అనుకునేటప్పుడు ఎన్నిసార్లు చనిపోదామనిపించలేదు. లేనిది కళ్ళే కానీ, చెవులు కాదని వాళ్ళకానాడు తెలియలేదు కదా! నన్ను అర్థం చేసుకుని నాతో మనసారా మాట్లాడిందెవరు.

పుట్టడం మామూలుగా పుట్టినా మధ్యలోనే కదా కళ్ళు పోయింది. అది నా తప్పులా అవుతుంది. వాళ్ళు సరైన జాగర్త తీసుకుంటే నాకానాడు ఆ అవస్థ ఉండేదా!

దారిన పోతుంటే ప్రతి చంటి పిల్లాడు ఆట పట్టించే వాడే కదా! ఎందుకూ కొరగాని వాళ్ళకు కూడా నేను లోకువే కదా! వెంటపడి ఎన్నెన్ని రకాలుగా ఏడిపించే వాళ్ళు. జుట్టు పట్టి లాగే వాళ్ళు, రాళ్ళతో కొట్టేవాళ్ళు, చేతిలో కర్ర తీసుకుని ఏడిపించే వాళ్ళు... అప్పుడు... అప్పుడు... అప్పుడసలు నాకు పేరుందా!

ఉందనే విషయమే మర్చిపోయేలా చేశారు. అందరికీ అప్పుడు నేను గుడ్డోణ్ణి కదా!

అన్నయ్యకు పెళ్ళయ్యేదాకా నేనూ ఎన్నెన్నో ఊహల్లో తేలిపోయే వాణ్ణో. నాకూ పెళ్ళవుతుంది. నాకొక భార్య వస్తుంది. అప్పుడు నా బాధలూ... కన్నీళ్ళు... కథలు కథలుగా ఆమెకు చెప్పొచ్చని ఎంతగా కలలు కన్నానో... ఆమె నాకు అన్ని రకాలుగా ఆసరాగా ఉంటుందని ఊహల్లో తేలిపోయే వాడినే...

ఇంట్లో వాళ్ళందరూ కూడ బలుకున్నట్లు గుడ్డోడికి పెళ్ళెందుకు. వాడి సంగతే వాడు చూసుకోలేడు. వాడి మెడకు డోలు ఒకటి ఎందుకని ఎంత వెక్కిరింతగా మాట్లాడే వాళ్ళు.

తనకూ భార్యా పిల్లలూ కావాలని, తనకూ ఒక కుటుంబం ఏర్పడాలనీ కలలు కన్న చీకటి కళ్ళల్లో నిప్పులు పోశారు కదా!

అప్పటి నుండీ నేనెందుకు బతుకుతున్నానో నాకు తెలియకుండా పోయింది కదా! ఏం చెయ్యాలో అంతూ పొంతూ లేకుండా పోతుంది గదా! ఇంట్లో వాళ్ళే నా గురించి ఆ విధంగా అనుకుంటున్నప్పుడు ఇంక బయటి వాళ్ళు అనడంలో వింతేముంది. అప్పుడెంత నిరాశకు గురయ్యానో! అప్పటి దాకా కళ్ళు లేకపోయినా నేనూ మగాణ్ణే అనుకునే వాణ్ణి. ఆ మాటలతో మనసు విరిచేసినప్పటి నుండీ నా మగతనమే ఆవిరై పోయినట్టయింది. అప్పుడు కదా అసలు నిజంగా నేను జీవచ్ఛవంలా మారి పోయింది.

అలాగే కళ్ళు లేకుండా జీవితాంతం ఉంటే ఇంకెన్ని చిత్రహింసలు భరించాల్సి ఉండేదో! ఆ ధర్మదాతలు, ఆ నయనాల దాతలు నా జీవితంలో తారస పడకుండా ఉంటే నా బతుకు అంధకారంలోనే అతి నికృష్టంగా తెల్లారిపోయి ఉండేది. ఆ మహానుభావులు నాలాంటి అంధులకు ఎందరికో అద్భుతమైన ప్రపంచాన్ని చూసే అవకాశం కల్పిస్తున్నారు. జీవితాంతం వాళ్ళ పటం పెట్టుకుని పూజించాల్సిందే. అప్పటికే వికలాంగుల కోటాలో ఉద్యోగం రాబట్టి జీవనం యిబ్బంది లేకుండా వుంది.

ఇంతకూ సరోజ తెమ్మంది టీ పొడా కాఫీ పొడా! కాఫీ పొడే అయి ఉంటుందిలే. ఆహా ఆ తూరుపు ఆకాశం ఎంత అందంగా ఉందో! తెల్లని మబ్బులు ఎన్నెన్ని ఆకృతులు దాలుస్తున్నాయో! ఆ మేఘాల్ని తొలుచుకుని సూర్యుడు తొంగి తొంగి చూస్తున్నాడు. అయ్యో ఇంతలోనే ఇంకో మేఘం కప్పేసిందే! ఊహూ సూర్యుడు ఊరుకుంటాడా! చీకట్లను చీల్చుకొని పైకి రాకుండా ఉంటాడా! ఊ చూడు వచ్చేశాడు. మబ్బులన్నీ చెల్లా చెదురై పోయాయి కదా!

చేతిలో ప్యాకెట్ కింద పడిపోయినా, చూసుకోకుండా ఆకాశంలోకి చూస్తాడేంది అతను ''హలో మిమ్మల్నే'' ఎవరో కేక వేస్తున్నారు.

మబ్బులతో సూర్యుడు దోబూచులాడ్డం చూస్తూ చేతిలో పేకెట్టు పడిపోయింది కూడా

## క్రికెట్ నేర్చుకుంటున్న జాన్!



పాత్రకు అనుగుణంగా ఆ పాత్రలో ఇమిడిపోవడం నటులకలవాటు. ఆటలకు సంబంధించి వచ్చిన చిత్రాలే తక్కువ! అలాంటి వాటిల్లో జాన్ అబ్రహం నటించింది మరీ తక్కువ. గతంలో 'ధన్....ధనా....ధన్' 'గోల్' సినిమాల్లో జాన్ నటించగా ఇప్పుడు తాజాగా డేవిడ్ ధావన్ దర్శకత్వం హిస్తున్న చిత్రం 'హుక్ యా క్రూక్'లో క్రికెట్ ప్లేయర్‌గా నటిస్తున్నాడు. దాని కోసం ఇప్పుడు రోహిత్ శర్మ దగ్గర క్రికెట్‌ను కూడా నేర్చుకుంటున్నాడు. ఈ సందర్భంగా డేవిడ్ ధావన్ మాట్లాడుతూ, 'నాకూ, జాన్‌కు క్రికెట్ అంటే పిచ్చి ఇష్టం. ఆట గురించి తెలుసు కానీ, ప్రతిభావంతులైన వారితో ఎలా ఆడాలో తెలియదు. సినిమా పరంగా క్రికెట్ ఆట నేర్చుకోవడం తప్పని సరి. జాన్‌ను రోహిత్ శర్మ మంచి ఆటగాడిగా తీర్చిదిద్దుతాడన్న నమ్మకం నాకుంది. ఇది జాన్‌కే కాదు నాకూ కొత్తే! ఇంతకు ముందు ఇలాంటి సినిమా ఎప్పుడూ తీయలేదు' అని ఆయన చెప్పారు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కాబోతోందని ఆయన అన్నారు.

చూసుకోలేదే!

తొందరగా ఇల్లు చేరాలి. లేదంటే అమ్మో ఇంకేమైనా ఉందా!

''ఏమండీ త్వరగా రాండి. ఎటో దిక్కులు చూస్తూ నడుస్తారేమిటండీ. అంత అయోమయంగా ఉంటే బతకడము ఎలాగండీ. రండి త్వరగా టైమెంతయ్యిందో చూడండి.

ఇదేంటండీ నేను చెప్పిందేమిటీ మీరు చేసిందేమిటీ! టీ పొడి తెమ్మంటే కాఫీ పొడి తెచ్చారే! ఇటు ఇయ్యండి. ఏదో ఒకటి తగల బెట్టుకుంటాను. టైమెంతయ్యిందో చూడండి''.

''అదికాదు సరోజా.... నేనూ...''

''వొద్దులే ఊరుకోండి. నా తల తిరిగి పోతుంది. మీరు చేసే పనులకు ఎంతకాలం ఇలా చిన్న పిల్లవాడికి చెప్పినట్టు చెప్పాలి. ఇంత వయసొచ్చిందే! ఆ మాత్రం ఇంగితం లేక పోతే ఎలాగండీ... కనీసం ఇతరుల్ని చూసి నేర్చుకుంటార్లే అని చూస్తున్నాను. ఊహూ... ఎప్పటికప్పుడూ కొత్తే.

మళ్ళీ ఇప్పుడా మొక్కల దగ్గరకు పోతారేంది. తొందరగా వొచ్చి రెడీకాండీ''.

వొస్తున్నాన్లే. నా బలహీనతలు తెలిసీ కూడా నన్నెందుకు విసుక్కుంటావో. ఇవేమన్నా చెడు అలవాట్లా.. చెడ్డ సావాసాలా. నన్ను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించవొచ్చుగా! ఎంత సేపటికి నా మీద విరుచుకుపడి ప్రయోజనం ఏముంటుంది. కొందరంతేనేమో జీవితాంతం సాధించే పనిలోనే ఉంటారు. చివరకు సాధించేదేమిటో వాళ్ళకీ తెలియదు.

''ఏంటండీ మాట వినపడకుండా గొనుక్కోవొద్దని ఎన్నిసార్లు చెప్పాను నీకు. టౌనుకి ఇంత దూరంలో ఇల్లు తీసుకుని, రకరకాల చెట్లు పెంచుకుంటూ ఆనందంగా బతుకుతున్నారు. మీ కోసం ఎన్నిరకాల హింసలో భరిస్తున్నాను కదా! నా కోసం బైక్ కొనమంటే కొనరు. ఇద్దరం హాయిగా వెళ్ళిపోవచ్చు గదా! నా మాట వినరెందుకనీ!''

''అమ్మో బైకా...! ఇంకేమైనా ఉందా! హూ... ఉట్టికెగరలేనమ్మ ఆకాశానికి ఎగిరిందంట అలా ఉంది నువ్వు చెప్పేది''.

రోజూ చస్తూ చస్తూ బతుకుతున్నా నికృష్టపు జీవితానికి ప్రాణం పోసి కొత్త జీవితం ప్రసాదించారు వాళ్ళు. బతికే మొక్కకి కాసిన్ని నీళ్ళు పోసి బతికించాలే గానీ, అది ఎండి పోవడమెలాగో ఆలోచించకూడదు.

''ఈ గాజు పాత్రని నీ మాటలు విని భళ్ళున పగుల గొట్టుకోలేను సరోజా. ఎప్పుడైనా సైకిల్ వెనుకనైనా ఎక్కానా నేను. రోడ్డు మీద నడవాలంటేనే ఎంత భయమో తెలుసా నాకు. ఇంకా మాటే ఎత్తొద్దు. నా జీవితానికి వాహనయోగం లేనే లేదు. అయినా దానికి నేనేం బాధ పడడం లేదు.

మధ్యలో పోయిన కళ్ళు మధ్యలోనే వొచ్చాయి. మళ్ళీ ఈ కళ్ళకు ఏ మాత్రం దెబ్బ తగిలినా నా ప్రాణాలు పోయినట్టే. ఎంత గొప్ప ప్రపంచం ఈ కళ్ళలో నిదురిస్తుందో తెలుసా!

హాయిగా బస్సులో కూర్చుని ఎంత దూరమైనా పోవొచ్చు. కిటికీ గుండా చూపుల్ని విసిరి వేస్తే ఎన్నెన్నో అందాలను ఆస్వాదించవచ్చు. మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే దృశ్యాలు క్షణక్షణానికీ మారుతూ ఉంటాయి కదా! జీవితానికి ఇంత కంటే ఆనందం. మరేమి ఉంటుంది. ప్రశాంతంగా సాగిపోయే ప్రవాహంలోకి రాయి విసరకు సరోజా.''

''అయితే ఇంక ఎప్పటికీ వెహికల్ కొనరా! ఇద్దరమూ ఉద్యోగాలు చేస్తున్నాము. ఎప్పుడూ ఊరికి దూరంగానే తగలడుతున్నాము. ఎప్పుడో ఒకసారి మీ మనసు మారి వెహికల్ కొనుక్కొందాం అంటారేమోనని ఎదురు చూస్తున్నాను. మీ మాటలు వింటుంటే ఇంక ఎప్పటికీ కొనేట్టు లేదుగా! భార్యను సుఖపెట్టాలని ఉంటేగా మీకు సనసన్నగా ఏడుపు మొదలైంది.

''ఎప్పటికీ ఇలాగే ఉండాలంటే నావల్ల కాదండీ. మీకు కళ్ళు పోయి వొచ్చిన మాట నిజమే కాదనను. ఎన్నో అవస్థలు పడ్డారు కాదనను. కళ్ళు వొచ్చిన తరువాతనైనా అందరిలా ఆలోచించాలి. అందరితో కలిసిపోవాలి. అందరు చేసే పనులు చెయ్యాలి. అంతే కానీ నేనింతే అని భీష్మించుకుని కూర్చుంటే ఎలాగండీ మీతో వేగేది.

ఉరుకులు పరుగులతో ఇంట్లో పనులన్నీ చేసుకోవాలి. సిటీకి దూరంగా ఉండాలి. ఈ విధంగా ఉద్యోగం చెయ్యాలంటే నా వల్ల అయ్యే పని కాదు. నేను ఉద్యోగం మానేస్తాను. మీ ఇష్టం వొచ్చినట్టు చేసుకోండి'' విసురుగా మంచమ్మీద వాలింది.

హూ. బెదిరించు బెదిరించు. మనకు మామూలే కదా ఇది. నువ్వు వెహికల్ కొనుక్కోమంటే కొనుక్కోవొచ్చు గదా! నీకు నడపడం భయమంటావు. నేను కూడా అదే కదా అంటున్నాను.

ఎప్పటికి అర్థం చేసుకుంటావు నన్నూ నా మనసునీ. ఎన్నిసార్లు వాదోపవాదాలు... ఎన్నిసార్లు ఇలా అలక పాన్పులు. ఈ రోజు కూడా ఆఫీసుకు సెలవు. వంటకు సెలవు. కడుపులో మంటకి కూడా... ప్చ్ అప్పుడప్పుడూ కడుపు మాడ్చుకోవడం కూడా ఆరోగ్యానికి మంచిదేలే. ఇది నీకు అలవాటై పోయింది. నాకూ అలవాటై పోయింది.

ఈ జీవితానికి ఇక ప్రశాంతత ఎప్పుడో! ఎప్పటికప్పుడు కన్నకలలన్నీ నెరవేరతాయనుకుంటే.... జీవితం నిండా ఎండ మావులే. ఎన్నింటిని జయించుకుంటూ పోవాలి. ఇదేనేమో జీవితమంటే. అమావాస్యలుంటాయి. పున్నములుంటాయి. సుఖదుఃఖాలుంటాయి. అన్నింటినీ అధిగమిస్తూ పోవాల్సిందేనేమో! ఎంతటివారికైనా ఏదొక బాధా సందర్భాలుంటాయి. అయితే నా జీవితంలో ఎప్పుడూ బాధలే వెంటాడుతా ఉంటాయెందుకో ప్చ్...!

*

